క్లుప్తంగా

పరామర్శ



సన్యాసినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: పాములవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీనాయకుడు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ అమరపు సన్యాసినాయుడు కుటుంబాన్ని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం పరామర్శించారు. సన్యాసినాయుడు మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న శంబంగి పాములవలసలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సన్యాసినాయుడు మృతికి గల కారణాలను ఆయన కుమారుడు కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పాములవలస సర్పంచ్ చప్ప సుధ, ఈశ్వరరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

చేనేత వస్త్రాలను కొనుగోలు చేద్దాం



చేనేత కార్మికులను సత్కరిస్తున్న జేసీ రాజు, తదితరులు

బొబ్బిలి: చేనేత కార్మికుల సేవలకు వెలకట్టి, వారు తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేద్దామని, వారిని బతకనిద్దామని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి. రాజు అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక చేనేత కాలనీలోని కార్మికులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో దేశాన్ని ఒకే తాటిపై నిలిపింది చేనేత రంగమేనన్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాల మేళవింపునకు చిహ్నంగా చేనేత రంగం మారిందన్నారు. బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి,శివకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ చైర్మన్ గెంబలి శ్రీనివాసరావు, చేనేత కార్మికులు పి.రాజు, శ్రీను, రాము, త్రినాథ్, ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అనుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి



శంబంగికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

బొబ్బిలి: అనుబంధాలకు రాఖీ పౌర్ణమి పర్వదినం ఓ ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక బ్రహ్మకుమారీస్ జ్ఞాన యోగ కేంద్రం ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి, సభ్యులు మాజీ ఎమ్మెల్యే శంబంగిని గురువారం కలిసి రాఖీ కట్టారు. ఈసం దర్బంగా శంబంగి మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు ఆధ్యాత్మికత, యోగా, ఆరోగ్యం వంటి అన్ని అంశాల్లో ప్రజలను చైతన్యవంతం చేస్తుండడం అభినందనీయమన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థులకు యూనిఫాం దుస్తులు అందజేస్తున్న దాతలు

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస ప్రాథమిక పాఠశాల విద్యార్థు లకు అదే గ్రామానికి చెందిన యువకులు వైట్ అండ్ వైట్ యూనిఫాం దుస్తులను గురువారం అందించారు. ఈ ఏడాది కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు వైట్ యూనిఫాం అందించామని యువకులు కె.సూర్యనారాయణ, గణనాథ, రమణమూర్తి, ఏ.హరి తెలిపారు. యువకులను ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, మొయ్యి శ్రీరాములు, పీఎంసీ చైర్‌పర్సన్ రమణమ్మ అభినందించారు.

సందడిగా ఫ్రెషర్స్ డే



విద్యార్థినులతో ఏబీసీడబ్ల్యూఓ శ్యామలాకుమారి, వార్డెన్ రెడ్డి, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని బీసీ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు.సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి(ఏబీసీడబ్ల్యూఓ) ఏ.శ్యామలాకు మారి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాబుద్ధులే భూషణ మన్నారు. విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. వార్డెన్ రెడ్డి, వసతి గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పగలే కాదు..రాత్రిళ్లూ అంతే..!

- బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య
- నిత్యం అవస్థలు పడుతున్న ప్రయాణికులు, పట్టణ వాసులు
- కాలేజ్‌రోడ్డు బంద్ కావడంతో మరింత పెరిగిన ట్రాఫిక్



పాత బస్టాండ్ ఆంజనేయ స్వామి గుడి వద్ద రాత్రి వేళ స్తంభించిన ట్రాఫిక్



పెదబజారులో నిలిచిపోయిన ట్రాఫిక్



బజారులో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు

బొబ్బిలి: జిల్లాలో రెండో అతి పెద్ద పట్టణంగా అభివృద్ధి చెందుతున్న బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు వివిధ వాణిజ్య సంస్థలు పెరుగుతునే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బొబ్బిలి డివిజన్ కేంద్రం అయింది. పట్టణం అన్ని రకాలుగా అభివృద్ధి పథంలోకి వెళుతుండడంతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. పగలు,రాత్రి తేడా లేకుండా ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రాజా కాలేజ్‌రోడ్డు గోతులమయం కావడంతో ఆ దారి వెంట వెళ్లే వేలాది మంది మిగతా రోడ్లను వినియోగించడంతో ట్రాఫిక్‌కు అంతూపొంతూ లేకుండా పోతోంది. ఉదయం,సాయంత్రం వేళల్లో పట్టణంలో రోడ్లపైకి వెళ్లాలంటేనే ప్రజలు బయపడిపోతున్నారు.

ఆ రోడ్ల విస్తరణ అత్యవసరం :

పట్టణంలో సుమారు 70వేల జనాభా ఉంది.ప్రతీ ఏడాది ద్విచక్ర వాహనాలు, కార్ల కొనుగోలు దారులు, వినియోగదారులు పెరుగుతునే ఉన్నారు. పట్టణంలోని పెద్ద బజార్, చిన్న బజార్, చర్చి సెంటర్, గొల్లవీధి, కృష్ణాటాకీస్ ఏరియా, దక్షిణ దేవిడీ, పాత బస్టాండు, ఎస్‌బీఐ కూడలి, తాండ్రపాపారాయ విగ్రహ కూడలి, రామాటాకీస్ ప్రాంతం, రెండు కోటల మధ్యరోడ్డు, కంచర వీధి,రంగరాయపురం జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిత్యం నిలిచిపోతోంది. ఈ ప్రాంతాల్లో రోడ్ల మీదే పలు వ్యాపారాలు చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అలాగే బజార్‌లో షాపుల యజమానులు తమ షాపు ముందు భాగాలను కూడా మరికొంత మంది చిరు వ్యాపారులకు అద్దెకిస్తున్నారు.మరో పక్క పట్టణంలో రైతు బజార్‌లేకపోవడంతో సమీప గ్రామాల రైతులు కూరగాయలను ఇరుకైన బజారు రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తుండడంతో వాహన రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా ఎస్‌బీఐ జంక్షన్, బజారు రోడ్డు, తాండ్రపాపారాయ జంక్షన్‌లలో ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణను అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది.

ఈ చర్యలు తీసుకుంటే మేలు

రోడ్ల మీద వ్యాపారాలు తొలగించడం, పగటి పూట మార్కెట్‌లోకి భారీ లారీలు బజారు రోడ్లలోకి వచ్చి, వివిధ సరుకుల అన్‌లోడ్, లోడింగ్ కోసం గంటల తరబడి నిలిచిపోతున్నాయి. వీటికి నిర్దిష్ట సమయాన్ని కేటాయించాలి. అలాగే వివిధ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు తెరవడం,విద్యార్థులను విడిచిపెట్టే సమయాలు ఒకటే కావడంతో ట్రాఫిక్ మరింత అస్తవ్యస్తమవుతోంది. కొద్ది సమయం తేడాతో తమ విద్యార్థులను ఆయా సంస్థలనుంచి విడిచిపెట్టే సమయాన్ని మార్పు చేయించాలి.

చర్యలు తీసుకుంటాం

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ స్తంభించినప్పుడల్లా వెళ్లి చక్కదిద్దుతున్నాం. ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నాం. నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఉన్న ప్రాంతాల్లో గస్తీ కాస్తున్నాం. మరింత పకడ్బందీగా వ్యవహరిస్తాం.

పి.జ్ఞాన ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ, బొబ్బిలి.

పులివెందులలో టీడీపీ గూండాల దాడులు దారుణం

- శంబంగి ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా టీడీపీ గూండాలు రెచ్చి పోతూ వైఎస్సార్‌సీపీ వారిపై దాడులకు దిగుతుండడం అతి దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం చేయడం రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంతలా దిగజారాయో చెప్పేందుకు నిదర్శనమన్నారు. టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేసి, వారిని ఇంట్లో బంధించి మంటపెట్టే ప్రయత్నం చేయడం చూస్తే ఎంత క్రూరంగా వ్యవహరించారో తెలుస్తోందన్నారు. గ్రామస్తులు కానీ ఆ సమయంలో వచ్చి తిరగబడకపోతే హత్య చేయడానికి టీడీపీ గూండాలు ఏమాత్రం వెనుకాడరన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస రాజ్యంలో ఉన్నామా అని ప్రశ్నించారు. దాడులు చేసిన టీడీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న వారంతా తప్పకుండా తగిన ఫలితం అనుభవిస్తారన్నారు.మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి. మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు నష్టం జరిగితే సహించేది లేదు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ,జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు భీముడు

రామభద్రపురం: మండలంలోని కాకర్లవలస,కారేడువలస గిరిజన రైతులకు నష్టం కలిగే విధంగా వారి సాగు భూములను ఏపీఐఐసీ అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకుంటే సంహిచేదిలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ,జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.భీముడు అన్నారు. బాధిత గిరిజన రైతులు గత కొన్ని రోజులుగా నిరసనలు,ధర్నాలు చేస్తున్న విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఏపీఐఐసీ అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకోబోతున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ, భీముడు విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద గిరిజన రైతులు తర తరాలుగా సాగు చేస్తున్న భూములను ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని ప్రభుత్వ ఆధికారులను ప్రశ్నించారు. అలాగే ఏపీఐఐసీ అధికారులు కూడా రైతులకు కనీస సమాచారమి వ్వకుండా వారు వేల రూపాయలు మదుపులు పెట్టి సాగు చేసుకుంటున్న పంటలను ఎలా ధ్వంసం చేస్తారని నిలదీశారు. ఏపీఐఐసీకి కేటాయించక ముందే గిరిజన రైతులు ఆ భూముల్లో సాగు చేసుకుంటున్నారని,ఇప్పుడు వాటిని ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు పేరిట దౌర్జన్యంగా స్వాధీనం చేసకోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న రైతులకే ఆ భూమిపై సర్వ హక్కులుంటాయన్నారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గిరిజన రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.అప్పారావు,కార్యవర్గ సభ్యురాలు భాయి రమణమ్మ, మండల నాయకుడు లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి



సమావేశమైన ఆర్పీలు, వీఓఏలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ, గ్రామాల్లో పనిచేస్తున్న మెప్మాఆర్పీ, వీఓఏలకు ఉద్యోగభద్రత కల్పించాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, స్వాతి డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆర్పీలు, వీఓఏలతో గురువారం సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం ఇవ్వకుండా, ఉద్యోగభద్రత కల్పించకుండా తీవ్రంగా శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం యాప్‌లపేరుతో పనిభారాన్ని పెంచుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కనీస వేతనాలు అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవవేతనం వ్యక్తిగత ఖాతాలకు మాత్రమే జమచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని, మహిళా వికాస్ యాప్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లాగిన్‌లేని ఆర్పీ, వీఓఏలకు వెంటనే లాగిన్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు సీహెచ్ రామ్మూర్తినాయుడు, సునీత, నాగరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరిస్తున్న శంబంగి, తదితరులు

బొబ్బిలి: ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను టీడీపీ కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు వార్డులోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అండ్‌కో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసి, వాటిని అమలు చేశారా అని మహిళలను ప్రశ్నించారు. దీంతో మహిళలంతా మాకు ఈ ప్రభుత్వంలో ఏం ఒరగలేదని, జగన్ హయాంలో హామీలను ఇచ్చిన తేదీలకే అమలు చేసేవారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన బాగా చేశారా..? ప్రస్తుతం చంద్రబాబు పాలన బాగుందా అని శంబంగి మహిళలను ప్రశ్నించగా... జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మాకు మంచి పనులు జరగాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్.వి. మురళీకృష్ణారావు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జ్ అరసాడ కామేశ్వరరావు,ఎస్.రామకృష్ణ తదితర కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా అందక రైతుల అగచాట్లు



మాట్లాడుతున్న వేమిరెడ్డి తదితరులు

బొబ్బిలి: బొబ్బిలి చుట్టుపక్కల మండలాల్లో యూరియా లభ్యం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. స్థానిక రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సినంత యూరియా అందజేసేవారన్నారు. ఈప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు పేరు మార్చిందే కానీ ఎలాంటి సేవలూ అందడం లేదని ఆరోపించారు. వరి నాట్లు జరుగుతున్న ప్రాంతాల్లో యూరియా కొనుగోలు చేయాలంటే రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కార్యాలయాల వద్ద నిల్వలు లేవన్నారు. పోనీ బయట కొనుగోలు చేయాలంటే రూ.300 నుంచి 400 వరకు పలుకుతోందన్నారు. అదీ వేరే ఉత్పత్తిని అంటగట్టి ఇస్తున్నారన్నారు. వద్దంటే యూరియా కూడా ఇవ్వమని వ్యాపారులు చెబుతున్నారన్నారు. సన్యాసిరావు, రవి తదితరులున్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

- ఈనెల 11న చలో కలెక్టరేట్



నినాదాలు చేస్తున్న ఆటోయూనియన్ సభ్యులు

రాజాం: ఎన్నికల సందర్భంగా ఆటో డ్రైవర్లకు కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీఐటీయూ అనుబంధ ఆటో యూని యన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు.పట్టణంలో ఆటో డ్రైవర్లతో గురువారం నిర్వ హించిన సమావే శంలో వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 21 ద్వారా ఆటో కార్మికులు నష్టపోతున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంట నే ఈ జీఓను సవరించి ఆటో కార్మికులకు న్యాయం చేస్తామని, ఫెనాల్టీలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా ఇంతవరకూ ఈ హామీ నెరవేరలేదని విమర్శించారు. వీటికి తోడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేయడంతో డ్రైవర్లు మరింత ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విధించే ట్యాక్సు అదనపు భారంగా మారిందని అన్నారు. రవాణా వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను గతంలో ప్రభుత్వమే నేరుగా నిర్వహించేదని, ఈ ప్రభుత్వం ఆటోమేటిక్ టెస్టింగ్ పేరుతో ప్రైవేటు వారికి అప్పగించి డ్రైవర్లపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వమే ఈ టెస్టులు నిర్వహించాలని, ప్రైవేటుకు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు జరిపే క్రమంలో ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జీఓ నెంబర్ 21ని రద్దుచేయాలని, ఈ జీఓ రద్దు నిమిత్తం ఈనెల 11న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఆటో డ్రైవర్ల నిరసన కార్యక్రమానికి ఆటో కార్మికులు అంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం. త్రినాథ్, ఆటో యూనియన్ నాయకులు రఘు, డి.ఎస్.ఆర్.మూర్తి, రాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ సంచుల సీజ్



వ్యాపారుల నుంచి పాలిథిన్ సంచులు సీజ్ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలో పాత బస్టాండ్‌తో పాటు బొబ్బిలి కూడలి, శ్రీనివాసరోడ్డు తదితర ప్రాంతాల్లోని తోపుడుబండ్లు, కిరాణా దుకాణాల్లో మున్సిపల్ కార్యాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, సిబ్బంది గురువారం తనిఖీలు నిర్వహించారు. పలువురు వ్యాపారుల వద్ద నుంచి పదికిలోల నిషేధిత పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, సీజ్ చేయడంతో పాటు అపరాధరుసుం విధించారు. పాలిథిన్ నిషేధానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోరారు.


రహదారి భద్రతా ప్రమాణాలను పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: ఆటో డ్రైవర్లంతా రహదారి భద్రతా ప్రమాణాలను పాటించాలని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో సీఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటోలు నడిపేవా రు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నా రు.యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఫిట్‌నెస్, సంబంధిత రికార్డుల న్నీ ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించు కోకూడదన్నారు. ప్రయా ణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రయాణ సమయంలో వారు లగేజీని ఆటోల్లో మరిచిపోతే పోలీసు స్టేషన్‌కు వివరాలతో సహా అందజేయాలన్నారు. ఆటోలను పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలన్నారు. వెనుక వచ్చే వాహనాలకు దారి విడ వాలన్నారు. పోలీసుల తనిఖీల సమయంలో రికార్డు లను తప్పనిసరిగా చూపించి సహకరించాలన్నారు. లేనిపక్షంలో కేసుల్లో ఇరుక్కుని విలువైన సమ యాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ పి.జ్ఞానప్రసాద్, శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటో రియం కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి




రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటా నికి లైబ్రేరియన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన గొప్ప కవి ఠాగూర్ అని అన్నారు. ఈయన రచించిన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి దక్కిందని విద్యార్థులకు వివరించారు.

జంగిల్ క్లియరెన్స్

సంతకవిటి: జావాం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి వెళ్లే మార్గంలో తుప్పల తొలగింపు పనులను డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.శ్రావణ్ కుమార్ గురువారం చేయించారు. జేసీబీ సహాయంతో తుప్పలు, డొంకలను తొలగించి, మార్గాన్ని శుభ్రం చేశారు.

చంద్రబాబు అంటేనే దగా, మోసం



దోలపేటలో మహిళలకు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజాం: సీఎం చంద్రబాబునాయుడు అంటేనే మోసం, దగా అని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా బాబు అండ్ కూటమి టీం నిలుస్తుందని విమర్శించారు. రాజాం పట్టణంలోని దోలపేటలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నష్టపోయిన విధానాన్ని ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకూ తీవ్ర అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. అధికారంలో లేని సమయంలో మైకులు పట్టుకుని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఎత్తివేయడమే కాకుండా, తాము ఇస్తామన్న సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలుచేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు, ప్రజలు తాము మోసపోయామని గుర్తించారని, కూటమిని ఎదురించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఐటీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ పాలవలస గోపి, సీనియర్ నాయకులు దూబ గోపాలం, కెంబూరి నారాయణరావు, పార్టీ పట్టణ కార్యదర్శి శాసపు వేణుగోపాలనా యుడు, పార్టీ నియోజకవర్గ పబ్లిసిటీ కన్వీనర్ ఆశపు సూర్యం, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం కన్వీనర్ పాలవలస శ్యాంసుందరరావు, జిల్లా కల్చరల్ విభాగం కన్వీనర్ డాక్టర్ బి.నరేంద్ర, ఆర్‌టీఐ కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, నాయకులు గోకవలస బాబూరావు, పిట్టా జగదీష్, గార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ



బొబ్బిలిలో రద్దీగా ఉన్న పెద్ద బజార్

బొబ్బిలి, రామభద్రపురం, బాడంగిలోని మార్కెట్లు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసంలో మూడో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం కోసం అవసరమై న పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్లు గురువారం కిటకిటలాడాయి. మహిళలు బంగారు కాసులు, పువ్వులు,పండ్లు,గాజులు,జాకెట్టు ముక్కలు తదితర పూజా సామగ్రి పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధరలు గతేడాది కంటే 40 నుంచి 50 శాతం పెరిగాయి. అరటిపండ్లు డజను రూ.70 నుంచి రూ.100 కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50 వరకు పలికింది. పూల ధరలు ఆకాశమే హద్దులా మారాయి. సంప్రదాయం ప్రకారం మహిళలు కొనుగోలు చేసే బంగారు కాసు నాణ్యత సంగతి పక్కన పెడితే గతేడాది కన్నా 50 శాతంపైచిలుకు పెరిగింది. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు దొరికే కాసు ఈ ఏడాది రూ.3,500 నుంచి 5వేల దాకా పలుకుతోంది.

– బొబ్బిలి/రామభద్రపురం/ బాడంగి



రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



బాడంగిలో పూజా సామగ్రి షాపువద్ద మహిళల సందడి

బుక్‌లెట్‌ల అందజేత



ఉపాధ్యాయులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణదొర

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సమ్మెటివ్, ఫార్మేటివ్ పరీక్షలు రాసేందుకు అవసరమైన బుక్‌లెట్‌లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని ఎంఈఓ లక్ష్మణదొర తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు బుక్‌లెట్‌లను గురువారం అందజేశారు.